

దిగ్విజయంగా...
భద్రాద్రిలో రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఉత్సవాలు విజయవంతంగా పూర్తి కావడంతో యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. 8లో



హెచ్ఆర్ పాలసీతో ప్రయోజనం
హెచ్ఆర్ పాలసీ అమలుతో పీఏసీఎస్‌ల ఉద్యోగులకు ప్రయోజనం ఉంటుందని డీసీసీబీ చైర్మన్ నాగభూషణం తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 19°

వాతావరణం
బుధవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం కొన్ని ప్రాంతాల్లో మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అభివృద్ధికి తోడ్పాటు తప్పనిసరి



డైనింగ్ హాల్, ఆర్చీని ప్రారంభిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: అందరూ బాధ్యతగా స్వగ్రామాల్లో అభివృద్ధికి చేయూతనివ్వాలని.. ప్రత్యేకంగా పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటునిస్తే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. నగరంలోని కొత్తగూడెం ప్రాథమిక పాఠశాలలో డైనింగ్ హాల్, ఉన్నత పాఠశాలలో నిర్మించిన ఆర్చి గేట్‌ను వారు మంగళవారం ప్రారంభించారు. వీటి నిర్మాణానికి రూ.3.5లక్షలు అందజేసిన సింగాల బిక్షం, రూ.5లక్షలు కేటాయించిన ఎర్రబోయిన గోవిందును అభినందించారు. వీరిని స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు ముందుకు రావాలని కోరారు. ఆతర్వాత ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు లింగయ్య, షేక్ రసూల్ సమకూర్చిన టై, బెల్ట్, ఐడీ కార్డులను అందజేశారు. కార్పొరేటర్లు కూరాకుల వలరాజు, రావూరి కరుణసైదబాబు, ఎస్‌ఎంసీ చైర్మన్లు గూటి శ్రీను, పిట్టల కనకయ్య, హెచ్ఎం గండు లక్ష్మీనారాయణతో పాటు మల్లెల వెంకటేశ్వర్లు, సూర్యకుమారి, శ్రీను, పుల్లయ్య, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఖమ్మం సహకారనగర్: జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఏర్పాటుచేసినట్లు సీఈఓ వీ.వీ.అప్పారావు తెలిపారు. జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో విద్యుత్, గ్రామీణాభివృద్ధి శాఖలతో పాటు కంటి వెలుగు, మన ఊరు – మన బడి, తొలిమెట్టు కార్యక్రమాలపై సమీక్షించనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు జెడ్పీటీసీలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎంపీపీలు, జిల్లా స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

12లోగా పరీక్ష ఫీజు చెల్లించండి

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ ఎస్డీఎల్‌సీఈలో పీజీ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ వరకు సప్లమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించాలని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి.గోపి సూచించారు. రెండు పేపర్ల వరకు రూ.600, మూడు, అంతకంటే ఎక్కువ పేపర్లకు రూ.700, ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకుంటే పేపర్‌కు రూ.500చొప్పన డీడీ తీయాలని తెలిపారు. అభ్యర్థులు డైరెక్టర్, ఎస్డీఎల్‌సీఈ, కాకతీయ యూనివర్సిటీ, వరంగల్ పేరిట ఎస్‌బీఐ/ యూబీఐల్లో తీసిన డీడీ, మెమో జిరాక్స్ జత చేసిన దరఖాస్తులను యూనివర్సిటీ పీజీ కళాశాలలో అందించాలని కోఆర్డినేటర్ సూచించారు.

ఉద్యోగ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: గ్రూప్–4, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీలత సూచించారు. 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి గ్రూప్–4, 60 శాతం మార్కులతో డిగ్రీ, బీఈడీ పాసైన వారికి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈనెల 11వ తేదీలోగా ఖమ్మంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తు చేసుకుంటే ఈనెల 12 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కులం, ఆదాయం, స్టడీ సర్టిఫికెట్లతో పాటు ఆధార్ కార్డు, నాలుగు ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 08742–227427, 95738 59598 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న డీసీపీఓ విష్ణువందన

నేలకొండపల్లి: బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యత అని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి (డీసీపీఓ) విష్ణువందన అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపించినా, అక్రమంగా దత్తత తీసుకున్నా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సదస్సులో ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ దారా ప్రసాద్, సీడీపీఓ బాలాత్రిపురసుందరి, ఏఎస్సై కోడె త్రాచు తదితరులు పాల్గొన్నారు.

బడికి సొబగులు!





ముస్తాబైన పాండురంగాపురం పాఠశాల (ఇన్‌సెట్) శాంతినగర్ పాఠశాలలో సిద్ధమైన వంటషెడ్

శరవేగంగా 'మన ఊరు - మన బడి' పనులు

- కొత్త రూపు సంతరించుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలు
- రాష్ట్రంలోనే ముందంజలో నిలిచిన జిల్లా
- ప్రారంభానికి సిద్ధమవుతున్న 62 పాఠశాలలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో 'మన ఊరు – మన బడి' పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. సర్కార్ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థులకు బోధనతో పాటు సౌకర్యాలు కూడా కల్పించేందుకు నిధులు కేటాయించింది. దీంతో జిల్లాలోని పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. జిల్లాలో 1,215 పాఠశాలలకు గాను 'మన ఊరు – మన బడి' కింద మొదటి విడతలో 426 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో పనులు దశల వారీగా పూర్తవుతుండగా, ప్రస్తుతం 62 పాఠశాలలు ఈ నెలలో ప్రారంభానికి సిద్ధమయ్యాయి.

బడుల బాగుకు శ్రీకారం

బోధనతోపాటు పాఠశాల వాతావరణం కూడా అనుకూలంగా ఉంటేనే విద్యార్థులు రాణించగలరనే భావనతో రాష్ట్ర ప్రభుత్వం 'మన ఊరు – మన బడి', మన బస్తీ – మనబడి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. గత ఏడాది ఏప్రిల్‌లో ప్రారంభించిన ఈ పథకంలో చేయాల్సిన పనులను కమిటీ ద్వారా గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని పనులను ఎంపిక చేయగా.. స్థానికంగా అవసరమయ్యే పనులను కమిటీల ఆధ్వర్యాన ఎంపిక చేశారు. మొత్తం 12 అంశాలను పరిగణనలోకి తీసుకోగా, మరమ్మతులు, మరుగుదొడ్ల ఏర్పాటు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, ఫర్నిచర్, భవనాలకు రంగులు, గ్రీన్‌చాక్ బోర్డు, ప్రహరీ, కిచెన్‌షెడ్ నిర్మాణం, శిథిలావస్థలో ఉన్న తరగతి గదుల స్థానంలో నూతన గదుల నిర్మాణం, డైనింగ్ హాల్, డిజిటల్ విద్య వంటి వాటికి ప్రాధాన్యత ఇచ్చారు.

పనుల పూర్తిలో జిల్లా భేష్

పథకం కింద పనులు పూర్తిచేయడంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో నిలిచింది. గతంతో పోలిస్తే పాఠశాలలు ఆహ్లాదకరమైన వాతావరణం, పూర్తి సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. గతంలో పాఠశాలల్లో మరుగుదొడ్లు, విద్యుత్ సమస్య, శిథిలమైన గదులు, ప్రహరీ సమస్యలు వేధించేవి. కలెక్టర్ గౌతమ్ చొరవతో రాష్ట్రంలోనే జిల్లాలోని ఎక్కువ స్కూళ్లలో పనులు పూర్తి చేశారు. ఎవరు ముందుగా పనులు పూర్తి చేస్తే వారికే నిధులు విడుదలవుతుండడంతో చాలా పాఠశాలల్లో యుద్ధప్రాతిపదికన చేపట్టడంతో నిధులు కూడా అదే స్థాయిలో విడుదలయ్యాయి. మొదటి విడతగా ఎంపికైన 426 పాఠశాలల్లో 62 పాఠశాలల్లో పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేశారు.

'మన బడి'లో రాష్ట్రంలోనే ముందంజ



మన ఊరు–మన బడిలో జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. మొదటి దశలో తీసుకున్న పాఠశాలల్లో పనులు శరవేగంగా సాగుతుండగా, కొన్నిచోట్ల పూర్తయ్యాయి. వీటిని ఈ నెలలో ప్రారంభిస్తాం. అన్నిచోట్ల పనులు పూర్తయితే వచ్చే విద్యాసంవత్సరం విద్యార్థుల సంఖ్య మరింత పెరగనుంది. – వీ.పీ.గౌతమ్, కలెక్టర్

రూ.54 లక్షలతో పనులు చేపట్టాం..



మా పాఠశాల అభివృద్ధికి 'మన బస్తీ–మన బడి' పథకం కలిసొచ్చింది. రూ.54 లక్షల నిధులతో విద్యుత్ కనెక్షన్, మరుగుదొడ్లు, వంటగది తదితర సౌకర్యాలు కల్పించడంతోపాటు మరమ్మతు పూర్తి చేశాం. సోలార్ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుచేశాం. కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాం. – సీహెచ్.కృష్ణకుమారి, హెచ్‌ఎం, శాంతినగర్

పనులు పూర్తయిన పాఠశాలల వివరాలు ఇలా...

ప్రారంభించనున్న పాఠశాలలు	మొత్తం పనులు పూర్తయినవి	ఇందులో రంగులు వేసినవి	రంగులు వేస్తున్న పాఠశాలలు	రంగులు వేయాల్సినవి	రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తయ్యేవి
62	51	22	08	21	11

సాఫీగా ముగించారు..





సిబ్బందికి సూచనలు ఇస్తున్న సీపీ వారియర్ (ఇన్‌సెట్) ఈవెంట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

- పూర్తయిన పోలీసు అభ్యర్థుల దేహ దారుఢ్య పరీక్షలు
- 22 రోజుల్లో అర్హత సాధించిన 12,567మంది
- చివరిరోజు పరిశీలించిన కలెక్టర్, కేఎంసీ కమిషనర్

ఖమ్మం క్రైం: ఇరవై రెండు రోజులు.. 24వేల మందికి పైగా అభ్యర్థులు... ఇంత మంది ఈవెంట్లకు హాజరైనా ఎలాంటి లోటుపాట్లు ఎదురుకాకుండా, విమర్శలు రాకుండా ముగించిన ఖమ్మం పోలీసులు భేష్ అనిపించుకున్నారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో స్టైపెండరీ ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల ఎంపికకు గాను గత ఇరవై రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఈవెంట్లు జరుగుతున్నాయి. దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం ముగియగా, చివరి రోజు 939 మంది అభ్యర్థులు తుది పరీక్షలకు అర్హత సాధించారని అధికారులు వెల్లడించారు. కాగా, చివరి రోజు పరీక్షలకు సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో కలిసి కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ట్రెయినీ కలెక్టర్ రాధికా గుప్తా పరిశీలించారు. మొత్తంగా 24,726 మంది అభ్యర్థులకు గాను 2,917 మంది గైర్హాజరు కాగా 21,809 మంది హాజరయ్యారు. వీరిలో 12,567 మంది అన్నింట్లో ఉత్తీర్ణులై తుది పరీక్షకు అర్హత సాధించారు.

డిసెంబర్ 8న ప్రారంభం

ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారికి గతనెల 8వ తేదీ నుంచి దేహ దారుఢ్య పరీక్షలు మొదలుపెట్టారు. ఎన్నడూ లేనట్లుగా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి ఈ పరీక్షలు నిర్వహించగా, ఎలాంటి అపవాదు రాకుండా పూర్తిచేయడంలో జిల్లా పోలీసులు సఫలమయ్యారు. ఎక్కడా మానవ ప్రమేయం లేకుండా రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ రైడర్ ప్యాడ్లు, సీసీ కెమెరాల నిఘా నీడలతో పరీక్ష నిర్వహించడం ద్వారా కచ్చితమైన ఫలితాలు వచ్చాయి. కాగా, ప్రతీ ఈవెంట్ వద్ద ఏసీపీ స్థాయి అధికారిని పర్యవేక్షణకు నియమించారు. ఇక తెల్లవారుజామున మొదలయ్యే ఈవెంట్లను సీపీ విష్ణు ఎస్.వారియర్ స్వయంగా పర్యవేక్షించారు. కాగా, ఈవెంట్లు సజావుగా సాగేలా కృషి చేసిన పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పీఈటీలు, వైద్య సిబ్బందితో పాటు సాంకేతిక నిపుణులకు మంగళవారం సీపీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీలు సుభాష్‌చంద్రబోస్, కుమారస్వామి, ఏఎస్పీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీలు ప్రసన్నకుమార్, ఆంజనేయులు, బస్వారెడ్డి, వెంకటేష్, రవి, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

అతి తక్కువ సమయంలోనే పూర్తి

రాష్ట్రంలోని పలుచోట్ల జరుగుతున్న ఈవెంట్లను పరిశీలిస్తే ఖమ్మంలోనే అతి తక్కువ సమయంలో పూర్తయ్యాయి. తెల్లవారుజామునే ఐదు గంటల నుంచి అభ్యర్థులు మైదానానికి వస్తుండగా, మధ్యాహ్నం 12గంటల్లోగా ఈవెంట్లు ముగించడం విశేషం. కాగా, అభ్యర్థులు అస్వస్థతకు గురైతే చికిత్స కోసం వైద్యులు, సిబ్బందిని నియమించడమే కాక ప్రత్యేకంగా బయో శౌచాలయాలు ఏర్పాటు చేశారు. కాగా, మహిళా అభ్యర్థులకు ప్రత్యేకంగా డిసెంబర్ 10నుంచి 14వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు.

తేదీ	కాల్‌లెటర్లు అందుకున్న వారు	హాజరైన వారు
డిసెంబర్ 8	550	491
9	757	664
10	1017	931
12	1078	938
13	1228	1094
14	1105	983
15	1,089	1,000
16	1,119	1030
17	1069	975
19	1070	969
20	1221	942
21	1,167	1022
22	1153	1020
23	1,181	1,047
24	1,239	1068
27	1,277	1,111
28	1,206	1,062
29	1,237	1,087
30	1,284	1,143
31	1,328	1,181
జనవరి 02	1,280	1,112
జనవరి 03	1,071	939
మొత్తం	24,726	21,809

లాంగ్ జంప్, పరుగులోనే ఎక్కువ మంది..

ఎస్సై, కానిస్టేబుళ్ల ఎంపికకు నిర్వహించిన ఈవెంట్లలో తొలుత పరుగు పందెం నిర్వహించారు. ఆతర్వాత లాంగ్‌జంప్, ఇతర పరీక్షలు జరిగాయి. అయితే, ఎక్కువ మంది అభ్యర్థులు లాంగ్‌జంప్, పరుగుపందెంలో అర్హత కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. మరికొందరు ఎత్తు తక్కువతో అర్హత కోల్పోగా, షాట్‌పుట్‌లో కొందరు అర్హత సాధించలేదు.

పారదర్శకంగా పూర్తిచేశాం...



అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా పూర్తిచేశాం. అత్యంత సాంకేతిక పరిజ్ఞానం విని యోగించడంతో ఎక్కడా లోటుపాట్లు ఎదురుకాలేదు. రిస్ట్‌బాండ్, చిప్ పరీక్షలు సజావుగా నిర్వహించటానికి దోహదపడ్డాయి, పోలీసులతో పాటు వైద్య సిబ్బంది, పీఈటీలు, ఐటీ నిపుణులు ఎంతో సహకరించారు. – విష్ణు ఎస్.వారియర్, పోలీసు కమిషనర్

ప్రణాళికాయుతంగా గ్రామాల అభివృద్ధి

సమీక్షలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన ప్రజాప్రతినిధులు అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రణాళికాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అధికారులు, గ్రామ సర్పంచ్‌లతో సమావేశమయ్యారు. జిల్లాలో అధిక వనరులు, ఆదాయం కలిగిన ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా, ఏదులాపురం, పోలేపల్లి, గుర్రాలపాడు, కూసుమంచి మండలం పాలేరు, కామేపల్లి మండలం కొమ్మినేపల్లి, కల్లూరు మండలం కల్లూరు గ్రామపంచాయతీల అభివృద్ధి వివరాలు ఆరా తీశాక కలెక్టర్ మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపడుతూ మున్సిపాలిటీలకు దీటుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, పీఆర్ ఈఈ శ్రీనివాస్, డీఎల్పీఓ ఆర్.పుల్లారావు, వి.ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను విజయవంతం చేయండి

ఖమ్మం సహకారనగర్: ఈనెల 18న మొదలుకానున్న కంటి వెలుగు రెండవ విడత కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సూచించారు. హైదరాబాద్ నుంచి ఆయన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీష్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్‌తో కలిసి వీసీ ద్వారా మాట్లాడారు. కంటి వెలుగు నిర్వహణకు పకడ్బందీగా షెడ్యూల్ రూపొందించాలని తెలిపారు. కాగా వీసీకి జిల్లా నుంచి జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కలెక్టర్ వీ.పీ. గౌతమ్, మేయర్ పునుకొల్లు నీరజ, అదనపు కలెక్టర్లు స్నేహలత, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీఆర్డీఓ విద్యాచందన, డీఎంహెచ్ఓ బి.మాలతి తదితరులు పాల్గొన్నారు.

పునఃప్రారంభమైన నిత్యకల్యాణాలు

భద్రాచలం: భద్రాచలంలోని సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం స్వామి వారి నిత్యకల్యాణాలు పునఃప్రారంభమయ్యాయి. ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను పురస్కరించుకొని గత నెల 23 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిత్యకల్యాణాలను ఆపివేశారు. పగల్ పత్తు ఉత్సవాల ముగింపు అనంతరం మంగళవారం స్వామి వారికి బేడా మండపంలో నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కా లం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

కార్యాలయాలకు స్థలం కేటాయించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న అఫ్జల్‌హసన్

ఖమ్మం సహకారనగర్/ఖమ్మం అర్బన్: టీఎన్జీవోస్ మధిర, వైరా, ఖమ్మం రూరల్ తాలూకా యూనిట్ల కార్యాలయాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌హసన్ కోరారు. ఈమేరకు మంగళవారం ఆయనకు కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వైరా తాలూకా యూనిట్ కార్యాలయానికి స్థలం, మధిర, ఖమ్మం రూరల్ తహసీల్దార్ కార్యాలయాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణాలకు అనుమతించాలని కోరగా, కలెక్టర్ గౌతమ్ తక్షణమే అనుమతి ఇవ్వాలని సంబంధిత శాఖలకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. అదే విధంగా ప్రభుత్వాస్పత్రి సదరం క్యాంపు విభాగం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలుపై విన్నవించగా కలెక్టర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఆదేశాలు జారీ చేశారు. టీఎన్జీవోస్ నాయకులు నందగిరి శ్రీను, బుద్దా రామకృష్ణ పాల్గొన్నారు. కాగా, టీఎన్జీవోస్ బాధ్యులు జలవనరుల శాఖ సీఈ శంకర్ నాయక్‌ను కలిశారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, ఇరిగేషన్ ఫోరం బాధ్యులు నరేష్, రమణ, షమ్మీ, అన్వర్ పాల్గొన్నారు.

హాస్టళ్ల భవనాల కోసం స్థలాన్వేషణ



వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

నేలకొండపల్లి: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు స్థలాలను పరిశీలిస్తున్నట్లు సోషల్ వెల్ఫేర్ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. నేలకొండపల్లిలోని బాలుర, బాలికల వసతి గృహాలను మంగళవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. వసతి గృహాల్లో రికార్డులు పరిశీలించాక విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీడీ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మధిర బాలికల, నేలకొండపల్లి, కారేపల్లి వసతి గృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని చెప్పారు. వీటికి సొంత భవనాలు నిర్మించేందుకు స్థలాలను పరిశీలించి కలెక్టర్‌కు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, హాస్టల్ విద్యార్థులకు 75 శాతం హాజరు ఉంటే ప్రతీ నెల రూ.500 ఖాతాలో ప్యాకెట్ మనీగా జమ చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 11 వసతి గృహాల కాలేజీ విద్యార్థులకు ఫీజులు, వసతి గృహం బిల్లులతో సంబంధం లేకుండా ప్రతీనెల రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. కాగా, 41 వసతి గృహాల్లోని 2,800 మంది విద్యార్థులకు నాలుగు జతల చొప్పున యూనిఫాం, ప్లేట్, గ్లాసులు, బెడ్‌షీట్లు, స్వెట్టర్, స్పోర్ట్స్ డ్రెస్, రెండు జతల షూ అందించామని వెల్లడించారు. వసతి గృహాల్లోని 256 మంది పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్నాక్స్, టీ ప్రత్యేకంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ విద్యార్థులు గత ఏడాది 96 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈసారి నూరు శాతం ఫలితాలు సాధించేలా ట్యూటర్లను ఏర్పాటు చేసినట్లు డీడీ వివరించారు.

రైతులకు అందుబాటులో డీసీఎంఎస్ సేవలు

వైరా రూరల్: డీసీఎంఎస్ ఆధ్వర్యాన రైతులకు అందుబాటులో ఉండేలా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్‌రావు తెలిపారు. మండలంలోని కేజీ సిరిపురంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం డీసీఎంఎస్ చైర్మన్ రాయల వెంకటశేషగిరిరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యాన 35 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా సిబ్బంది శ్రమిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూస్తూనే రైతులకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తున్నట్లు చెప్పారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తయ్యాక సిరిపురం నుండి ఆంధ్రాకు వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు మంజూరు చేయాలని రైతులు, గ్రామస్తులు కోరగా అలాంటి ప్రతిపాదన లేదని అదనపు కలెక్టర్ తెలిపారు. డీఎస్‌ఓ రాజేంద్రప్రసాద్, డీఎం సోములు, సర్పంచ్ మట్టూరి సత్యప్రసన్నాంబ, డీసీఎంఎస్ బీఎం సందీప్‌తో పాటు రామచంద్రరావు, నవీన్, మచ్చా నాగేశ్వరరావు, మట్టూరి కృష్ణారావు, గాలి శ్రీనివాసరావు, మచ్చా వెంకటేశ్వర్లు, పెరుగు నాగరాజు, నారపోగు నాగరాజు, మట్టూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే



మంత్రి అజయ్‌తో రాములునాయక్, జీవన్‌లాల్

వైరా: రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ కలిశారు. ఐటీ శాఖ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్‌తో కలిసి మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రులను కలిసిన ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అంధుల వెల్ఫేర్ సొసైటీకి రూ.1.31 లక్షలు



నగదు అందచేస్తున్న కరస్పాండెంట్, విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: రాజమహేంద్రవరంలోని స్ఫూర్తి వెల్ఫేర్ అంధుల ఎడ్యుకేషన్ సొసైటీకి సత్తుపల్లి డాక్టర్ కేకేఆర్ సీఎస్ఆర్ ఆదిత్య పాఠశాల విద్యార్థులు విరాళం అందజేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా సేకరించిన రూ.1.31లక్షలను మంగళవారం అందజేయగా కరస్పాండెంట్ చలసాని శ్రీవైష్ణవి మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలతో పెంపొందిస్తూనే సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ చలసాని హరీష్, ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో 'అంగన్‌వాడీ'కి భవనం



నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్, తదితరులు

ఖమ్మంఅర్బన్: దాతల సహకారంతో అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం నిర్మించేందుకు సిద్ధమయ్యారు. నగరంలోని ఆరో డివిజన్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక చిన్నారులు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నందు స్థానికులు ముందుకొచ్చారు. ఈమేరకు కార్పొరేటర్ నాగండ్ల కోటి దృష్టికి తీసుకెళ్లగా స్థలాన్ని గుర్తించి నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

దమ్మపేట: మంచు కురిసే సమయంలో లారీని, కారు ఢీకొట్టిన ఘటన మండలంలోని పట్వారిగూడెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంగళవారం ఉదయం వేకువజామునే వరంగల్ జిల్లా నర్సంపేటకు చెందిన దూపాటి కనకయ్య.. స్వగ్రామం నుంచి కారులో దమ్మపేట గ్రామానికి డ్రైవింగ్ చేసుకుంటూ వస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం 7 గంటల సమయంలో పట్వారిగూడెం గ్రామ శివారులో తీవ్రంగా మంచు పడుతుంటడంతో దారి కనిపించక ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టాడు. కారులో ఎయిర్ బెలూన్లు తెరచుకోవడంతో డ్రైవింగ్ చేస్తున్న కనకయ్యకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

కలెక్టర్, అధికారులను కలిసిన వీఆర్ఏలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీఆర్ఏల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్ : వీఆర్ఏల సంఘం నాయకులు మంగళవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీఆర్ఏ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా లింగరాజుతో పాటు పలువురు వీఆర్ఏలు పాల్గొన్నారు. ఆతర్వాత టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్, ఖమ్మం ఆర్డీఓ కార్యాలయ ఏఓ, ట్రెసా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుమంచి శ్రీనివాసరావును తదితరులు కూడా కలిశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,700	2,500
మిర్చి కొత్తవి	20,100	13,500
నిల్వమిర్చి	20,000	13,000
మిర్చి తాలు	10,500	7,000
పత్తి	8,200	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,881

దిగ్విజయంగా..

రాష్ట్రపతి పర్యటన, ముక్కోటి ఉత్సవాలు సక్సెస్

- ఊపిరి పీల్చుకున్న దేవస్థాన, ప్రభుత్వ యంత్రాంగం
- మళ్లీ మార్చిలో పుష్కర పట్టాభిషేకానికే హడావుడి



ఉత్తరద్వారం నుంచి సీతారామలక్ష్మణమూర్తులను దర్శించుకుంటున్న భక్తులు (ఫైల్)

భద్రాచలం: భద్రగిరి క్షేత్రంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము పర్యటన, ముక్కోటి ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలలో కీలకంగా భావించే తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం కావడంతో ఇటు దేవస్థానం, అటు ప్రభుత్వ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పర్యటనకు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకున్న ప్రణాళికలు సఫలీకృతమయ్యాయి. దేవస్థానం ఈఓ శివాజీ, కలెక్టర్ అనుదీప్ నిరంతర పర్యవేక్షణతో అన్ని సవ్యంగా పూర్తయ్యాయి.

అధికారుల ఉక్కిరిబిక్కిరి

వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను విజయవంతం చేయాలని సమీక్షా సమావేశాలను నిర్వహిస్తున్న సమయంలో అనుకోకుండా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పర్యటన ఖరారు కావడంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రధానంగా దేవస్థానం ప్రాంగణంలోనే ప్రసాద్ పథకం ప్రారంభం ఉండటంతో కలెక్టర్ అనుదీప్ ఆదేశాల మేరకు దేవస్థానం అధికారులు ఆగమేఘాల మీద పనులు చేపట్టారు. 28న రాష్ట్రపతి పర్యటన, జనవరి 1,2వ తేదీలలో తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనం ఉండటంతో ఇటు పర్యటన ఏర్పాట్లతో పాటు ఉత్సవాలలో భక్తుల కోసం సకల వసతులను సమకూర్చటంలో దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దేవస్థానం ఈఓ శివాజీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు, పాలనాధికారులు నిరంతరం పనుల పరవేక్షణలో మునిగితేలారు. కలెక్టర్ అనుదీప్ సైతం ఈ పర్యటనను, ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. పర్యటన, ఉత్సవాల విజయవంతానికి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ ఉరుకులు పరుగులు పెట్టించారు. ఎస్పీ వినీత్ బందోబస్తు ఏర్పాట్లలో ప్రత్యేక శ్రద్ధ వహించారు. రెండేళ్ల కోవిడ్ విరామం అనంతరం జరిగిన శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలతోపాటు రాష్ట్రపతి పర్యటనను విజయవంతం చేసిన ఘనత కలెక్టర్ అనుదీప్‌కు దక్కింది. కాగా రాష్ట్రపతి పర్యటనలో అతిగా ట్రాఫిక్ నియమాలను విధించారనే ఆరోపణలు వినిపించాయి. రాష్ట్రపతి యాదాద్రిలో పర్యటనలో అక్కడి అర్చకులు, అధికారులకు అధిక సంఖ్యలో పాస్‌లు జారీ చేశారని, రాష్ట్రపతితో ఫొటో దిగే అరుదైన అవకాశాన్ని కల్పించారని, కానీ ఇక్కడ మాత్రం రాత్రింబవళ్లు కష్టపడ్డ దేవస్థానం అర్చకులు, అధికారులకు రాష్ట్రపతి పర్యటనలో పాల్గొనే అవకాశం ఇవ్వలేదనే అపవాదను మాత్రం జిల్లా అధికారులు మూటగట్టుకున్నారు.

మార్చిలో పుష్కర పట్టాభిషేకం..

జగాలను ఏలే జగదభి రాముడికి జరిగే పట్టాభిషేక మహోత్సవం ఎంతో ప్రత్యేకమైనది. దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి శ్రీరామనవమి మరుసటి రోజున పట్టాభిషేకం జరుపుతారు. ప్రతి 60 ఏళ్లకోసారి మహా సామ్రాజ్య పట్టాభిషేకం వైభవంగా జరుగుతుంది. భద్రాచలంలో 1927లో, 1987లో ఈ వేడుక జరిపారు. మళ్లీ 2047లో మాత్రమే మహాపట్టాభిషేకం జరుగుతుంది. ఇది కాకుండా ప్రతి 12 సంవత్సరాలకోసారి పుష్కర పట్టాభిషేకం జరుపుతారు. 1999, 2011లో ఈ పట్టాభిషేకం జరగగా, మళ్లీ ఈ ఏడాది 2023లో ఈ కార్యక్రమం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరగనుంది. శ్రీరామనవమి, ముక్కోటి ఉత్సవాలు విజయవంతం కావడంతో తిరిగి పుష్కర పట్టాభిషేక మహోత్సవాలను విజయవంతం చేయటానికి దేవస్థాన వైదిక కమిటీ, అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. పాల్గొనే ముఖ్య అతిథులకు ఆహ్వానాలతో పాటుగా జరపాల్సిన శాస్త్రోక్త కార్యక్రమాలపై ప్రధాన దృష్టి సారించారు. మార్చి 30న శ్రీరామనవమి, 31న జరిగే పుష్కర పట్టాభిషేకంల కార్యాచరణపై సంక్రాంతి అనంతరం అంతర్గత సమావేశాలను దేవస్థానం అధికారులు, వైదిక కమిటీలు నిర్వహించనున్నాయి.

ఇద్దరు హాస్టల్ విద్యార్థినుల అదృశ్యం

- సీసీ కెమెరాల పుటేజీ ద్వారా విచారణ
- అనుమానితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



హాస్టల్‌లో సిబ్బందిని విచారిస్తున్న ఏఎస్ఐ జయబాబు

సత్తుపల్లి: ఇద్దరు హాస్టల్ విద్యార్థినులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. సత్తుపల్లి బాలికల గిరిజన ప్రభుత్వ వసతిగృహంలో ఉంటున్న సత్తుపల్లి మండలం సిద్ధారానికి చెందిన 10 తరగతి విద్యార్థినితో పాటు భద్రాద్రి జిల్లా కొత్తగూడెంకు చెందిన 9వ తరగతి విద్యార్థిని సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హాస్టల్ నుంచి బయటకు వెళ్లినట్లు సమాచారం. ఈ నెల 1వ తేదీన నూతన సంవత్సర వేడుకలకు సిద్ధారంలోని ఓ బాలిక ఇంటికి, అదేరోజు గంగారంలోని ఆమె పెద్దనాన్న ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత అశ్వారావుపేటకు వెళ్లినట్లు ఫోన్‌లో తండ్రికి సమాచారం అందగా ఆయన వెళ్లి పిలుచుకొచ్చాడు. ఇక 2వ తేదీ సోమవారం ఉదయం సత్తుపల్లిలో కొత్త బట్టలు ఇప్పించి వారిని హాస్టల్‌లో వదిలాడు. అయితే, పాఠశాలకు వెళ్లాలని సూచించిన వార్డెన్ మాధవి హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను పర్యవేక్షించటానికి వెళ్లింది. మధ్యాహ్న భోజనం అనంతరం ఇద్దరు బాలికలు బయటకు వెళ్లిపోగా, సాయంత్రం హాజరు నమోదు సమయాన గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అటు హాస్టల్ సిబ్బంది, ఇటు తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడం, తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి ఆందోళన చేపట్టడంతో మంగళవారం ఉదయం పోలీసులకు హాస్టల్ వార్డెన్ ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్ఐ జయబాబు హాస్టల్‌కు చేరుకుని విచారణ చేపట్టారు.

తొలుత ఖమ్మం.. ఆపై..!

హాస్టల్ విద్యార్థినుల అదృశ్యంపై ఆందోళన వ్యక్తం కావటంతో పోలీసులు పలు కోణాల్లో విచారణ వేగవంతం చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాల సీసీ కెమెరాలన్నీ పరిశీలించగా ఇద్దరు విద్యార్థినులు సోమవారం బస్టాండ్ వైపు చేతిసంచితో వెళ్తున్నట్లు గుర్తించారు. బస్సులో ఖమ్మం వెళ్లి అక్కడి నుంచి ఇతర ప్రాంతానికి వెళ్లి ఉండొచ్చని భావిస్తున్నారు. దీంతో అనుమానితుడిగా భావిస్తున్న ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరొకరి ఫోన్ స్విచాఫ్‌గా ఉండటంతో ఆయన స్వగ్రామానికి పోలీసు సిబ్బందిని పంపించారు. కాగా, ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటనపై వారి తల్లిదండ్రుల ఫిర్యాదుతో విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ టి.కరుణాకర్ తెలిపారు.

టీఎల్ఎంతో మెరుగైన బోధన



రఘునాథపాలెం : టీఎల్ఎం మేళాను ప్రారంభిస్తున్న డీఈఓ సోమశేఖరశర్మ, తదితరులు

- అభ్యసనపై ఆసక్తి పెరిగే అవకాశం
- జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ

రఘునాథపాలెం: విద్యార్థులకు మెరుగైన బోధన కోసం టీఎల్ఎం దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ పేర్కొన్నారు. అలాగే, అభ్యసనపై ఆసక్తి పెరిగే అవకాశముందని చెప్పారు. మండలంలోని వీ.వీ.పాలెం జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మండల స్థాయి టీఎల్ఎం(బోధనోపకరణాల మేళా)ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో నిత్యం టీఎల్ఎం మేళా చేస్తుంటారని.. దీనిని మరింత మెరుగుపర్చాలని సూచించారు. ఎంపీపీ ఇందిర, జెడ్పీటీసీ మాలోతు ప్రియాంక, సర్పంచ్ రావెళ్ల మాధవి, ఎంపీడీఓ రామకృష్ణ, నోడల్ అధికారి అనితాదేవి, ఎంఈఓ ఎం.శ్రీనివాస్‌తో పాటు యరగర్ల హన్మంతరావు, నాగరాజు, నారాయణ, వేమిశెట్టి మోహన్‌దాసు తదితరులు పాల్గొనగా, మేళాలో ప్రతిభ చూపిన పాఠశాలలకు బహుమతులు అందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

చింతకాని : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని జెడ్పీ చైర్మన్ లింగాల కమలరాజ్ తెలిపారు. మండలంలోని నాగులవంచ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టీఎల్ఎం మేళాను చైర్మన్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈమేళాలో 32 ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించారు. సర్పంచ్ ఆలస్యం నాగమణి, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్, ఎంఈఓ మోదుగు శ్యాంసన్, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం

సత్తుపల్లి/కల్లూరు: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ విద్యారంగం అభివృద్ధికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సత్తుపల్లిలోని జ్యోతి నిలయం, కల్లూరులోని బాలికోన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన మండలాల స్థాయి బోధనోపకరణాల మేళాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు నూతన పద్ధతుల్లో బోధించటం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెరిగి అద్భుతమైన ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రాజశేఖర్, ఎంఈఓలు బి.రాములు, ప్రసాద్, ఎంపీపీలు దొడ్డా హైమావతి, బీరవెల్లి రఘు, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నోడల్ అధికారులు ఎస్.రాజేశ్వరరావు, హెచ్ఎంలు జి.మాధవరావు, కృష్ణమోహన్, వనదుర్గ, కె.మార్క్, సుజాతతో పాటు నున్నా కృష్ణయ్య, డాక్టర్ లక్కినేని రఘు, పసుమర్తి చందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చింతకాని : మేళాలో ఉపకరణాలను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ కమలరాజ్



సత్తుపల్లి : అభ్యసన పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

రేపు అవగాహన సదస్సు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని డ్రాయింగ్ అధికారులు, డిస్బర్సింగ్ అధికారులకు ఆదాయ పన్ను మదింపు, టీడీఎస్‌పై గురువారం అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మధ్యాహ్నం రెండు నుంచి నాలుగు గంటల వరకు సదస్సు ఉంటుందని జిల్లా ఖజనాశాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంటపల్లి సత్యనారాయణ తెలిపారు. సదస్సులో రంగారెడ్డి జిల్లా ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ అదితి గోయల్ హాజరై ఆదాయ పన్ను మదింపు, టీడీఎస్‌పై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు.

వినియోగదారుడికి రూ.1.63 లక్షలు చెల్లించండి..

ఖమ్మంలీగల్: ఎలక్ట్రికల్ స్కూటర్ పనితీరు బాగాలేదని చెప్పినా పట్టించుకోకపోవడంతో కొనుగోలుకు చెల్లించిన నగదుతో పాటు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్, మెంబర్ వి.లలిత, ఎ.మాధవీలత తీర్పు చెప్పారు. మంగళవారం వెలువడిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలం రామాంజనేయ కాలనీకి చెందిన పొన్నెకంటి రాజీవ్‌కుమార్ బెంగళూరుకు చెందిన ఓలా ఎలక్ట్రికల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి గత ఏడాది ఏప్రిల్ 7న రూ.1,63,549 చెల్లించి ఎలక్ట్రికల్ స్కూటర్ కొనుగోలు చేశాడు. అయితే, కొన్నాళ్లకే పనితీరు బాగాలేకపోవడంతో డిస్ట్రిబ్యూటర్ దృష్టికి తీసుకెళ్లినా సరిగ్గా స్పందించలేదు. దీంతో న్యాయవాది కాళ్లూరి లక్ష్మీనర్సింహారావు ద్వారా నోటీసు జారీ చేసి, జిల్లా వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును విచారించిన ఫోరం చైర్మన్ వినియోగదారుడు చెల్లించిన నగదుతో పాటు నష్టపరిహారం కింద రూ.20 వేలను చెల్లించాలని తీర్పు చెప్పారు.

ఆన్‌లైన్ యాప్‌లో రూ.2లక్షలు స్వాహా

ఖమ్మంఅర్బన్: పెట్టుబడికి రెట్టింపు చెల్లిస్తామని ఆన్‌లైన్ యాప్ మెసేజ్‌ను నమ్మిన ఓ విద్యార్థి రూ.2లక్షలు నష్టపోయాడు. ఖమ్మం అర్బన్ పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం మమత రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో ఉండే విద్యార్థి ఎం.నిఖిల్ నాయక్ ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడికి రెట్టింపు ఇస్తామంటూ వచ్చిన ప్రకటన చూశాడు. దీంతో ఆయన రూ.2,37,710 చెల్లించగా, రెట్టింపు ఏమో కానీ యాప్ నిర్వాహకులు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించాడు. ఘటనపై మంగళవారం బాధితుడు చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని గుర్రాలపాడు వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దరూకు మార్ మౌర్య స్థానిక గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ కుటుంబంతో కలిసి గుర్రాలపాడులో ఉంటున్నాడు. మంగళవారం పని ముగించుకుని నడుస్తూ వెళ్తుండగా కోదాడ నుండి ఖమ్మం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుండి బలంగా ఢీకొట్టింది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను ఖమ్మం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ వ్యక్తి కనిపించకుండా పోవడంతో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశా రు. స్థానిక ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన యర్ర ఏసుబాబు అనే వ్యక్తి గత ఏడాది డిసెంబర్ 24వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రా లేదు. కుటుంబీకులు తమ బంధువులు, స్నేహితుల వద్ద గాలించగా ఆచూకీ లభ్యం కాలేదు. ఏసుబాబు భార్య సంగీత చేసిన లిఖిత పూర్వక ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కదిలిస్తే కన్నీళ్లే..

- బతుకుదెరువు కోసం యూపీ నుంచి వలస
- పాతికేళ్లుగా పానీపూరీ బండితో ఉపాధి
- భార్య, నలుగురు పిల్లలతో జీవన పోరాటం
- కిడ్నీల సమస్యలతో ఒక్కసారిగా మారిన పరిస్థితి
- చేతులెత్తి సాయం కోరుతున్న పేద కుటుంబం

దీనగాథ



కుటుంబ సభ్యులతో అవదేశ్ యాదవ్

ఖమ్మం గాంధీచౌక్: ఆడుకునే వయస్సులో తల్లిదండ్రులు దూరం కావడంతో ఆ బాలుడు యూపీ నుంచి బంధువుల వెంట ఖమ్మం చేరుకున్నాడు. వారు చూపించిన పని చేసుకుంటూ యుక్తవయస్సు వచ్చేసరికి ఓ యువతిని పెళ్లి చేసుకున్నాడు. ముగ్గురు కూతుళ్లు, ఓ కుమారుడు జన్మించగా పాతికేళ్లుగా ఇక్కడే స్థిరపడి స్వయం ఉపాధితో కుటుంబాన్ని నెట్టుకొన్నాడు. కాగా, కుటుంబ పెద్ద కిడ్నీ జబ్బు బారిన పడడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. పూర్తి వివరాలివీ..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దేవర్య జిల్లా భట్ని గ్రామానికి చెందిన అవదేశ్ యాదవ్ పదేళ్ల వయస్సులో బంధువుల వెంట ఖమ్మం వచ్చాడు. దాదాపు 25 ఏళ్లుగా గట్టయ్య సెంటర్‌లో పానీపూరి బండి పెట్టుకొని జీవనం సాగిస్తున్నారు. భార్య శైలోజ్ యాదవ్ భర్తకు చేదోడువాదోడుగా ఉంటుండగా కూతుళ్ల కుషి యాదవ్, పూజా యాదవ్, నిఖి యాదవ్, కుమారుడు బిందావుల్ యాదవ్ ఇక్కడే చదువుకుంటున్నారు. ఈ నేపథ్యాన అవదేశ్ యాదవ్ ఆర్నెళ్లుగా కిడ్నీల సమస్యతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారగా.. కుటుంబ పెద్ద ఆరోగ్యం కోసం ఆకుటుంబం పరితపిస్తోంది. ఆరోగ్య శ్రీ ద్వారా ఓ వైద్యశాలలో డయాలసిస్ చేస్తుండగా ఏ, బీ పాజిటివ్ కిడ్నీ దాతలు ముందుకొస్తే వైద్యానికి రూ.15 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఎవరైనా బ్రెయిన్ డెడ్ అయిన వారు ఉంటే కిడ్నీలు దానం చేసి తన కుటుంబాన్ని కాపాడాలని అవదేశ్ యాదవ్ కోరుతున్నాడు. రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు సాయమందించి తమ తండ్రిని బ్రతికించాలని చిన్నారులు వేడుకుంటున్నారు. దాతలు 70754 55073 నంబర్ ద్వారా ఫోన్ పే, గూగుల్ పేలో ఆర్థికంగా సాయం అందించవచ్చు.

సంగారెడ్డి చెరువును తొలగిస్తే ఉద్యమిస్తాం



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ, అధికారులు

కల్లూరు రూరల్: మండలంలోని లక్ష్మీపురం వద్ద ఉన్న సంగారెడ్డి చెరువును తొలగించాలనే యత్నాలను మానుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమించాల్సి వస్తుందని ఆయకట్టు రైతులు హెచ్చరించారు. చెరువును ఆర్డీఓ సీహెచ్.సూర్యనారాయణ, జనవనరుల శాఖ ఈఈ మందా లక్ష్మీనారాయణ, తహసీల్దార్ బాబ్జీప్రసాద్, ఆర్ఐ అన్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు ఉబ్బన గోపాలస్వామి, కనమతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, ఇస్లావత్ వస్‌రాం, కల్యాణపు గోపాలరావు, వడ్డాణపు వాసు, ధర్మసోత్ బీక్యానాయక్, కుంచాల గుర్వయ్య, కోట శ్రీనివాసరావు తదితరులు వారితో మాట్లాడారు. ముంపు రైతులు కొందరు ఇక్కడ చెరువును తొలగించి కాల్వ నిర్మించి ఆయకట్టు భూములకు నీటి సరఫరా కోసం యత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు ఈ ప్రయత్నానికి మద్దతు తెలపకుండా, సాగర్ కాల్వ తూము ద్వారా చెరువును నింపాలని కోరారు. దీంతో రెండు వారాల్లోగా చెరువు కట్ట మరమ్మతులు చేయిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

ఈవెంట్స్‌లో సత్తాచాటిన అన్నాచెల్లెళ్లు

నిరుపేద గిరిజన కుటుంబం నుంచి ఎంపిక



తల్లిదండ్రులతో కళ్యాణ్, నిర్మల

నేలకొండపల్లి: అది మూరుమూల గ్రామం... ఎర్ర బస్సు ఎరగని గిరిజన తండా... కూలీనాలీ చేస్తేనే కడుపు నిండేది... సెంట్ భూమి కూడా లేని నిరుపేద కుటుంబంలో పుట్టిన గిరిజన బిడ్డలు పోలీసు ఈవెంట్లలో సత్తా చాటారు. నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి తండాకు చెందిన తేజావత్ నాగేశ్వరరావు–హుస్సేనీ దంపతులు కాయకష్టం చేసుకుని జీవనం సాగించేవారు. అయినా పిల్లలను చక్కగా చదివించారు. ఈమేరకు వీరి కుమారుడు కళ్యాణ్ బీటెక్ పూర్తిచేయగా, కుమార్తె నిర్మల డిగ్రీ పూర్తి చేసింది. ఇటీవల జరిగిన పోలీసు ఉద్యోగాల ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించగా, గత నెల 14న జరిగిన ఈవెంట్లలో నిర్మల, మంగళవారం కళ్యాణ్ అర్హత సాధించి తుది పరీక్షకు ఎంపికవడంతో అన్నాచెల్లెళ్లను పలువురు అభినందించారు.

ఫోర్జరీ పత్రాలు సృష్టించిన ఐదుగురిపై కేసు

కల్లూరు: భూమి అమ్మకంపై ఫోర్జరీ ధృవీకరణ పత్రాలు సృష్టించిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కల్లూరు ఎస్సై కొండల్‌రావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కల్లూరు శాంతినగర్‌కు చెందిన జొన్నలగడ్డ కుమారి భూమిని రూ.5 లక్షలకు అమ్మినట్లు నకిలీ అగ్రిమెంట్ కాగితాలను సృష్టించిన కొందరు కోర్టుకు సమర్పించడంతో కుమారికి నోటీసులు జారీ అయ్యాయి. దీంతో ఆమె తానెవరికీ భూమి అమ్మలేదని, అగ్రిమెంట్ కాగితాలు ఫోర్జరీవని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు విచారణ చేపట్టి ఫోర్జరీ సంతకాలతో కోర్టును నమ్మించిన దయావతి, యంగళ సురేష్, కె.అశోక్, యంగల వెంకటేశ్వర్లు, ఎం.వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండలరావు పేర్కొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.